జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 2-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 744 పేజీలు: 4 వెల : రూ.7




# ఎమ్మెల్యే గారు.. కనికరించండి!

- కొరసవాడ నుంచి పాతపట్నం వెళ్లే రోడ్డుపై దృష్టి సారించండి
- వాహనంపై వెళ్లలేకపోతున్నాం.. జారిపడుతున్నాం
- ఓట్లు వేసి గెలిపించాం కదా.. మా కోసం ఆ మాత్రం చేయలేరా?
- మీ మాటను కూడా అధికారులు పట్టించుకోవడం లేదా..ఏంటీ?
- బాబ్బాబు.. ఎంజీఆర్ గారు.. కొద్దిగా పుణ్యం కట్టుకోండి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, వాహనచోదకులు

**శ్రీకాకుళం/కొత్తూరు, ఆగస్టు 3 (వార్త):** ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారు.. కొద్దిగా కనికరించండి.. బూరగాం నుంచి పాతపట్నం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది.. చిన్న వర్షం పడితే చాలు.. రోడ్డు బురదగా మారి ప్రమాదకరంగా తయారవుతోంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు వెళుతుంటాయి. బురదలో కూరుకుపోయి వాహనచోదకులు జారిపడుతున్నారు. ప్రతిరోజూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు ఆనించి మీరు ఇల్లు కూడా కడుతున్నారు కదా.. మీరే దగ్గరుండి ఈ రోడ్డు పనులు చేయిస్తే.. మీకు మంచి పేరు వస్తుంది కదా.. నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించు కునేందు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు.. వారంతా ఈ రోడ్డు మీదుగా వెళ్లే సమయంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారంతా ఛీ.. ఛీ.. అనుకునే అవ కాశం ఉంది కదా.. ఈ రోడ్డు దుస్థితిపై మీరు సంబంధిత అధికారులకు హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. అయినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. అంటే మీ ఆదేశాలను కూడా వారు బేఖాతరు చేస్తున్నారంటే.. అది మీకు అవమానం కదా.. మరోవైపు ఈ నెల 4వ తేదీ నుంచి నీలమణి దుర్గమ్మ అమ్మవారి వార్షిక వారోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్కళాంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనార్థం పాతపట్నానికి తరలిరానున్నారు. ఒకవేళ రహదారిని ఇలాగే బురదమయంగా వదిలేస్తే, వారోత్సవాల సమయంలో వచ్చే వేలమంది భక్తులకు తీవ్ర అవస్థలు తప్పవు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని భక్తజనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అధికారులు తక్షణమే స్పందించి, బురదమయమైన రోడ్డుపై కంకర/చిప్స్ వేసి రాకపోకలకు అనువుగా మార్చేలా చూడాలని పలువురు ఎమ్మెల్యేను కోరుతున్నారు. మరి ఎమ్మెల్యే గారు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సివుంది.






## ‘పోక్సో’ నిందితుడుకి..

# సూర్యతేజ వత్తాసు

- విద్యార్థులు నోరు విప్పకుండా బెదిరింపులు
- భయంతో గడగడలాడుతున్న విద్యార్థినులు
- యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

4లో



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మందస చారిత్రక ప్రదేశాన్ని హెరిటేజ్ సైట్‌గా ప్రకటించాలి

* చారిత్రక వారసత్వ సంపదను కాపాడాలి * ధ్వంసం చేసిన ప్రాచీన చారిత్రక కట్టడాలను అక్కడే పునర్నిర్మించాలి * న్యాయం జరిగే వరకు పరిరక్షణ కమిటీ పోరాటం ఆగదు



**మందస, ఆగస్టు 3(వార్త):** మందస పట్టణంలోని చారిత్రక ప్రదేశాన్ని హెరిటేజ్ సైట్ గా ప్రకటించాలని, చారిత్రక వారసత్వ సంపదను కాపాడాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మందసలో ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మందస ప్రభుత్వం జూనియర్ కళాశాల సమీపంలోని బహిరంగ ప్రదేశంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు అధ్యక్షత జరిగింది. సుమారు మూడు గంటల పాటు సాగిన సమావేశంలో సుమారు 100 మంది ఆహ్వానిత ప్రతినిధులు పాల్గొన్నారు. ధ్వంసం చేసిన ప్రాచీన చారిత్రక కట్టడాలను అక్కడే పునర్నిర్మించాలని, న్యాయం జరిగే వరకు పరిరక్షణ కమిటీ పోరాటం ఆగదని నాయకులు అన్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బౌద్ధ జైన మతానికి సంబంధించిన ప్రాచీన కట్టడాలను కాంట్రాక్టర్ ధ్వంసం చేసిన చోటనే పునర్నిర్మించాలని, అంతవరకూ పరిరక్షణ కమిటీ సాగిస్తున్న దశలవారి పోరాటం ఆగదని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తొలుత మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ప్రకారం ప్రాచీన కట్టడాల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందని, ఇందుకు సంబంధించిన పురావస్తు ప్రభుత్వ శాఖ పూర్తి బాధ్యతను వహించాలని, ప్రాచీన కట్టడాల విధ్వంసానికి పాల్పడిన వారిపైన చట్టపరమైన చర్యలను తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీ కోరుతున్నట్టుగా ధ్వంసం చేసిన ప్రాచీన శిలాశాసనాలను తక్షణమే అక్కడ నెలకొల్పి పునర్నిర్మాణం చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వారసత్వ సంపదను కాపాడవలసిన పాలకులు విధ్వంసానికి అవకాశం ఇవ్వకుండా తక్షణమే విధ్వంసానికి పాల్పడిన వారిపై చర్యలను తీసుకోవాలని ఆయన కోరారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటాలకు అరుణోదయ సంఘీభావం ఉంటుందని ఆయన అన్నారు. కళింగసీమ రాష్ట్ర సాధన సమితి నాయకుడు డాక్టర్ జీవీతేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల అండదండలతోనే ప్రాచీన కట్టడాల విధ్వంసం సాగడం శోచనీయమన్నారు. ఒకనాటి జైన, బౌద్ధ మతాలకు సంబంధించిన కట్టడాలను, వాటి అవశేషాలను ధ్వంసం చేసిన వారిపైన రక్తపరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రముఖ సంఘ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి, పీడీఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్తిరి దానేష్, పలు ప్రజా సంఘాల నుంచి నాయకులు ఎం.రామారావు, కొర్ల హేమారావుచౌదరి, కొమర వాసు, వివిరమణమూర్తి, నాగమణి, పాడి, బమ్మిడి ఆనందరావు , మురళి, బాలు తదితరులు పాల్గొని మాట్లాడుతూ ప్రాచీన చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం తమ సంఘీభావాన్ని తెలిపారు. ఇందు కోసం సాగే పోరాటాల్లో తమ భాగస్వామ్యం ఉంటుందని వారు తెలియజేశారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు అధ్యక్షోపన్యాసం చెబుతూ కూల్చివేసిన మండపాన్ని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. పురావస్తు శాఖ జోక్యం చేసుకొని వెంటనే మందస చారిత్రక వారసత్వ సంపదను కాపాడాలని, ఈ చారిత్రక ప్రదేశాన్ని హెరిటేజ్ సైట్ గా ప్రకటించాలని అన్నారు. సమావేశంలో నిర్వాహకుల తరపున భిల్లు, బాలు, సునీల్, రబీ, మోహన్, కిరణ్, గణపతి బెహరా, రాజు మల్లారెడ్డి, గయా సంతు, దుదుష్టి, నిరంజన్, ధీనభందు, అర్జున, తురక గణపతి, మహేష్ బెహరా, తలగాన వెంకటరావు, శివ, పూర్ణచందు మహరణ పాల్గొన్నారు.









## ఇచ్ఛాపురాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలి

**ఇచ్ఛాపురం ఆగస్టు 3 (వార్త):** టి.బరంపురం పంచాయతీ లో ఎండిన వరి నారుమడులను వైస్సార్సీపీ బృందం పరిశీలన చేసింది. స్థానిక రైతులు ఎంపీపీబోర పుష్ప తో కలిసి పొలాలలో ప్రస్తుత పరిస్థితి గమనించారు. వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. వరి విత్తనాలు మొలకెత్తి ఎండిన పరిస్థితులలో రైతులు వానలు కొరకు ఎదురుచూస్తూ ఆశలు కోల్పోయినారని, ఒకవైపు వాన జాడ లేదని ఇంకోవైపు బహుదా నది గ్రోయిన్స్ నిరుపయోగంగా మారటం వలన, దమ్ములు చేసి, వరి నాట్లు వేయడానికి సాగు నీరు లేక ఈ సంవత్సరం పంటలపై ఆశలు వదులుకునే పరిస్థితిలో రైతంగాం, ఉందని అన్నారు. ఈ ఒక్క పంచాయతీ మాత్రమే కాదు మొత్తం నియోజకవర్గం మొత్తం కూడా కరువు పరిస్థితులు ఏర్పడినవని, ప్రభుత్వం ముందుకు వచ్చి నియోజకవర్గంను కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలన్నారు.

## సోంపేట మండలంలో కరువు ఛాయలు



**సోంపేట, ఆగస్టు 3(వార్త):** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సోంపేట మండలంలో కరువు ఛాయలు నెలకొన్నాయని మండల వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జూన్, జూలై నెలలో కనీస వర్షపాతం లేకపోవడం ఎండలు తీవ్రంగా ఉండడంతో నారుమల్లు కూడా పాడైపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెద సాగు చేస్తున్న రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని అన్నారు. వెద పద్ధతిలో సాగు చేస్తున్న వరి ఎండలకు మాడిపోయి మరోవైపు కలుపు విపరీతంగా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహేంద్ర తనయ నదిలోను, బారువా గ్రోయన్ లోనూ ఎక్కడా చుక్క నీరు కూడా లేనటువంటి పరిస్థితుల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆందోళన కలిగిస్తుందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సోంపేటను కరువు మండలం గా ప్రకటించి ప్రత్యామ్నాయంగా రైతులకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేయాలని కోరారు.

## పలాస అభివృద్ధిపై దువ్వాడ శ్రీధర్ బాబా ప్రశ్నల వర్షం



**పలాస, ఆగస్టు 3 (వార్త):** పలాస నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ హామీల అమలు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దువ్వాడ శ్రీధర్ బాబా ఏడు కీలక ప్రశ్నలను ప్రజల ముందుంచారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమాధానాలు చెప్పాలని కోరుతూ ప్రశ్నావళిని విడుదల చేశారు. ప్రశ్నావళిలో ప్రధానంగా ఈ అంశాలను ప్రస్తావించారు పలాసను జిల్లాగా ప్రకటిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఎందుకు నెరవేరలేదని ప్రశ్నించారు. నగేష్ కుటుంబానికి న్యాయం: హత్యకు గురైన మహిళా నగేష్ కుటుంబానికి రూ.10 కోట్ల పరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీ అమలైందా అని నిలదీశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా జీడీ పరిశ్రమకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం ఎందుకు లభించలేదని ప్రశ్నించారు. పలాస మున్సిపాలిటీలో 15 శాతం ఆస్తి పన్ను పెంపును ఎందుకు అమలు చేశారని వివరణ కోరారు. కేంద్రంలో కులగణన జరిగినప్పటికీ రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకబడిందని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గంలోని భూములు, చెరువులు, కొండలు, దేవాదాయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటని అడిగారు. మద్యం ధరలు, నాణ్యత, బెల్ట్ షాపుల నియంత్రణ, లిక్కర్ దోపిడీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందని ప్రశ్నించారు. ప్రజలకు సంబంధించిన ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఎమ్మెల్యే దువ్వాడ శ్రీధర్ బాబా డిమాండ్ చేశారు.

## జగనన్న కాలనీల్లో అక్రమాలపై విచారణ జరపాలి



**పలాస, ఆగస్టు 3 (వార్త):** గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయని టిడిపి నాయకులు ఆరోపించారు. పేదల హక్కులను హరించే చర్యలను ఏమాత్రం సహించబోమని వారు హెచ్చరించారు. సోమవారం వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామంలోని జగనన్న కాలనీలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై మండల రెవెన్యూ అధికారికి స్థానిక నాయకులు గ్రీవెన్స్ వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో, గత ప్రభుత్వ కాలంలో అర్హులైన లబ్ధిదారులకు బదులుగా అనర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు కేటాయించారని, అసలు లబ్ధిదారుల పేర్లు తొలగించి అక్రమంగా పట్టాలు మార్చి విక్రయించారనే ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, అసలు ఎన్ని పట్టాలు మంజూరయ్యాయి, ఎంతమంది అర్హులకు అందాయనే వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు మాట్లాడుతూ పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని, ప్రతి పట్టాను క్షుణ్ణంగా పరిశీలించి అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్లు గరుడభద్ర టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కోనారి గణపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనారి గణపతి, కొంచారు మోహన్‌రావు, మురిపింటి అఖిల్, కోనేరి వల్లభరావు, కొమర కృష్ణారావు, ఎరుపల్లి సోమయ్య, ఎరుపల్లి లక్ష్మీనారాయణరావు, చొక్కారి ధనరాజు, జమ్మిడి ప్రశాంత్, ఎరుపల్లి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## కేసుపురం పంచాయతీలో ఇంటింటికి టిడిపి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** ఇచ్ఛాపురం మండలంలోని కేసుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమ నిర్వహణ సందర్భంగా (డోర్ టు డోర్) ప్రచార కార్యక్రమాన్ని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఐటిడిపి మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పి.పురుషోత్తం, జి.భీమరాజు, ఎం.జానకిరావు, జగన్నాథం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# కేటీ రోడ్డుపై అక్రమ స్టాల్స్



**పలాస, ఆగస్టు 2 (వార్త):** ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పలాస పట్టణంలోని కేటీ రోడ్డుపై అక్రమ ఆక్రమణలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నెహ్రూ పార్కు సమీపంలో రహదారిపైనే పలు స్టాల్స్, దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు, లీజు లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండానే వ్యాపారాలు సాగుతున్నాయంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్టాల్స్‌కు అనుమతులు ఎవరు ఇచ్చారనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీకి ఆదాయం చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రోడ్డుపై వ్యాపారాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ప్రజలు గుమిగూడడంతో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో వాహనాలు ఢీకొన్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వారు గుర్తుచేస్తున్నారు. కొంతమంది మున్సిపల్ దిగువస్థాయి సిబ్బంది సహకారంతో అక్రమ స్టాల్స్ కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై అధికారుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన లేకపోవడం దురదృష్టకరం. కేటీ రోడ్డును వెంటనే ఆక్రమణల నుంచి విముక్తం చేసి, అక్రమ స్టాల్స్‌ను తొలగించాలని పలాస--కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## చేనేత సమ్మేళనం విజయవంతం చేయాలి

**జి.సిగడాం, అగస్టు 3 (వార్త):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల పరిరక్షణకు చేనేత కార్మికుల సంక్షేమం, ఆత్మ గౌరవం లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 5న విజయవాడలో ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 10గంటలకు నిర్వహించే చేనేత సమ్మేళనాలు, మహాసభలను జయప్రదం చేయాలని మండల బీజేపీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి, ఓబీసీ రాష్ట్ర మోర్చా అధ్యక్షులు వజ్జపర్తి రఘురాం, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు పోలిరాజు కోరారు. సోమవారం వారు దేవరవలస చేనేత సొసైటీ కార్మికులకు, చేనేత సంఘాలను కలిశారు. ఈ సమ్మేళనానికి హాజరుకావాలన్నారు.





## వెంకటరమణ కుటుంబానికి జనసేన సాయం

**మందస, ఆగస్టు 3(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద పంచాయతీకి చెందిన జనసైనికుడు నర్తు వెంకటరమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. దీంతో మందస మండలంలోని దున్నవూరు పంచాయతీ జనసైనికులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.11వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. వెంకటరమణకు వివాహమై మూడు సంవత్సరాలు కాగా రెండేళ్ల కుమార్తె, ఆరు నెలల పసికందు కుమారుడు ఉన్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సౌరు బాబురావు, కోడ చండిరావు, సూరాడ నదీర్.యాదవరావు, బొంగు మురళి, ఆనంద్, జోగారావు, రామారావు, బాలు, శ్రీమూర్తీ, శివశంకర్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ మృతి

* బంధువుల ఆందోళన * వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు * ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. విచారణ ప్రారంభం

**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే, సంతతోటకు చెందిన భాగ్యలక్ష్మి (49) అనారోగ్యంతో నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే ఆమె మరణానికి కారణమంటూ ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రి వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బంధువులతో మాట్లాడి వివరాలు సేకరిస్తూ ఘటనపై విచారణ చేపట్టారు. మహిళ మృతికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## మడపాంలో 34 తులాల బంగారం చోరీ

**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):** నరసన్నపేట మండలం మడపాంలో జరిగిన బంగారం చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ కండక్టర్గా పనిచేస్తున్న జామి నర్సింగరావు ఇంట్లో సుమారు 34 తులాల బంగారం చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, గత నెల 28వ తేదీన జామి నర్సింగరావు తన భార్య అనారోగ్యానికి శ్రీకాకుళంలో చికిత్స చేయించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి సుమారు 34 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు తెలిసింది. అయితే కుటుంబ పరిస్థితులు, ఇతర కారణాల వల్ల బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించలేకపోయారని, శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఇళ్లను తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

## విద్యార్థి ప్రియాంకకు అభినందనలు

**జి.సిగడాం, ఆగస్టు 3(వార్త):** భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం పురస్కరించుకొని డి ఆర్ వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుమరాపు ప్రియంక జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకొంది. ఈ సందర్భంగా సోమవారం టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవి కుమార్ గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆ విద్యార్థినకు దుస్సా లువా తో సత్కరించి అభినందలు తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

## రూ.20వేలు అందించిన క్లాస్‌మేట్స్

నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. దీంతో దాతలు ఆ కుటుంబానికి సాయమందిస్తున్నారు. వెంకటరమణ చదువుకున్న హైస్కూల్లో జూనియర్ క్లాస్ మేట్స్ రూ.20వేలు అందించారు. నర్తు వెంకటరమణ అకాల మరణం చాలా బాధాకరమని, తన తోటి చదువుకున్న 10వ తరగతి జూనియర్ స్టూడెంట్(2015-2016)వ సంవత్సరం బ్యాచ్ తరపున మృతుని కుటుంబానికి తమ వంతు సహాయంగా ఒకరికొకరు అండగా నిలిచారు. ఆ కుటుంబ సభ్యులు సమక్షంలో వెంకటరమణ పాప భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఈ సాయమందించడం జరిగిందని వారు తెలిపారు. భవిష్యత్ లో ఏదైనా అవసరముంటే మా క్లాస్మేట్స్ అందరం మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్. జీవన్, ఎం.ప్రసాద్, ఎస్.ఉమాపతి, ఆర్.వంశీ పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

# మాజీమంత్రి సీదిరి అక్రమ అరెస్టుపై రచ్చబండ కార్యక్రమాలు

**మందస, ఆగస్టు 3(వార్త):** మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును అక్రమ అరెస్టు చేయడంపై రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి, నిజాలను ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చింతాడ గణపతి నివాసంలో మందస క్లస్టర్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ టీచర్ల పోస్టుల అక్రమాలపై పోరాటాలు చేస్తామన్నారు. ప్రియతమ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అక్రమ అరెస్ట్ పై ప్రజలలో సానుభూతి పెరిగిందని, మందస మండలంలో వైఎస్సార్ సీపీ చేపడుతున్న కార్యక్రమాలకు మందస పోలీసులు అడ్డుకోవడంతో ఉన్నతాధికారుల అనుమతి కోరాలని నిర్ణయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో డీఎస్సీ టీచర్ల పోస్టుల నియమాకంలో అక్రమాలపై పోరాటాన్ని పలాస నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సీదిరి అక్రమ అరెస్ట్ గ్రామాల్లో వివరించేందుకు రచ్చబండ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించాలని, అధికార టీడీపీ చేపడుతున్న గ్రామస్థాయి కార్యక్రమాలకు పోలీసులు ఎలా అనుమతి ఇస్తున్నారో, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి రాజకీయ కార్యక్రమాలకు అనమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, ఎంపీపీ డొక్కరి



దానయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, పార్టీ నాయకులు చింతాడ గణపతి, బాడ జగన్, జయరాం, పులారి పితాంబరం, మడియా రామకృష్ణ, బత్తిన లక్ష్మణ్, దున్న హరికృష్ణ, బేపల తిరుపతిరెడ్డి, మట్ట షన్ముఖరావు, డొక్కరి పాపారావు, రాజాన శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### టీడీపీ క్లస్టర్ ఇన్ చార్జి దాసరి తాతారావు



**మందస, ఆగస్టు3(వార్త):**తెలుగుదేశం పార్టీలోనే అభివృద్ధి సాధ్యపడుతుందని క్లస్టర్ ఇన్ చార్జి దాసరి తాతారావు, క్లస్టర్ కోఆర్డినేటర్ చౌదరి మురళీకృష్ణ అన్నారు. మందస మండలంలోని లొహారిబంద పంచాయతీలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మన అభిమాన నాయకురాలు, ఎంఎల్ఏ గౌతు శిరీషా నిర్దేశికత్వంలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి దాసరి తాతారావు, క్లస్టర్ కో ఆర్డినేటర్ చౌదరి మురళీకృష్ణ, యూనిట్ ఇన్ చార్జి కుప్పిలి వెంకటరావు, బూత్ ఇన్ చార్జి అందాల మోహనరావు, కో ఆర్డినేటర్ రాపాక భువనేశ్వరరావు, వలిమాన గణపతి, కోరాడ మోహనరావు, పందిరి జోగారావు, అందాల జోగారావు, మహిళలు పాల్గొని విజయవంతం చేశారని నాయకులు తెలిపారు.

## రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ



**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):**నరసన్నపేట మండలంలోని దేశవానిపేట గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 100 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, సచివాలయ అధికారులు రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియ అనంతరం భూముల సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించి, సంబంధిత భూ వివరాలను నమోదు చేసి కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేసినట్లు తెలిపారు. కొత్త పాస్ పుస్తకాల ద్వారా రైతులకు భూ యాజమాన్యానికి సంబంధించిన వివరాలు మరింత పారదర్శకంగా అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో భూ లావాదేవీలు, రుణాల మంజూరు తదితర అంశాల్లో రైతులకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా సవరణలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు రామారావు, రావడ గణపతిరావు, గొలివి రామారావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి




**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):** నరసన్నపేట వెలుగు కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. సదస్సులో ఏపీఎం లలితకుమారి, మండల మహిళా అధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొందడానికే పరిమితం కాకుండా వాటిని సద్వినియోగం చేసుకుని చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో అడుగుపెట్టి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయ పథకాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడంతో పాటు ఇతర మహిళలకు కూడా ఆదర్శంగా నిలవవచ్చని తెలిపారు. సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వీవోలు, సీసీలు, సీఎఫ్లు పాల్గొని సభ్యులకు స్వయం ఉపాధి, రుణాల వినియోగం, ఆర్థిక ప్రణాళిక, ఆదాయ వనరుల విస్తరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు సంఘటిత శక్తితో ముందుకు సాగి ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని వక్తలు ఆకాంక్షించారు.

## 8న జిల్లాస్థాయి యోగా పోటీలు

**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జిల్లాస్థాయి యోగా పోటీలను నిర్వహించనున్నట్లు వివేకానంద ధ్యాన యోగా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం నరసన్నపేట యోగా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, వివిధ వయో విభాగాలకు చెందిన యోగా క్రీడాకారుల కోసం ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలను నరసన్నపేటలోని యశస్విని గాయత్రి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులతో పాటు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో యోగా పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందుతాయని సమితి సభ్యులు తెలిపారు. యోగాను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

# మహిళలు, బాలలకు చట్టాలపై అవగాహన అవసరం

*** శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసులు**

*** గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచన**



**సారవకోట, ఆగస్టు 3 (వార్త):** మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ సూచించారు. సోమవారం సారవకోట కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించిన ఆయన, అలాంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సందేహాస్పద ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉంటే మహిళలు, బాలికలు తమ హక్కులను మరింత సమర్థంగా కాపాడుకోగలరని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శక్తి టీం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**నరసన్నపేట, ఆగస్టు 3(వార్త):**రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన విద్యార్థులను గుర్తించి అడ్మిషన్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు సూచించారు. సోమవారం నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్ఎంటిలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే అర్హులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రవేశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. చదువు మధ్యలో నిలిపివేసిన వారు, విద్యను కొనసాగించాలనుకునే వారికి రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అర్హులైన అభ్యర్థులను గుర్తించి వారికి ప్రవేశాల ప్రక్రియపై వివరాలు తెలియజేసి ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్లు జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్ఎంటిలు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ఎంటీల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలి

**నరసన్నపేట, ఆగస్టు 3(వార్త):** సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న సీఆర్ఎంటీ (జ=మీ) సిబ్బందికి రెండు నెలలుగా బకాయి పడిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గిరిధర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతనాలు సకాలంలో అందకపోవడంతో సీఆర్ఎంటీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణతో పాటు రోజువారీ ఖర్చులు, పిల్లల విద్య, ఇతర అవసరాలు తీర్చుకోవడం కూడా భారంగా మారిందన్నారు. జిల్లాలో సుమారు 235 మంది సీఆర్ఎంటీలు విధులు నిర్వహిస్తున్నప్పటికీ, గత రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సరికాదన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సీఆర్ఎంటీల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## యువకవి నీలంకు శ్రీశ్రీ కళావేదిక సత్కారం

**పోలాకి, ఆగస్టు 3 (వార్త):**పోలాకి మండలం రాళ్లపాడు గ్రామానికి చెందిన యువకవి నీలం జాతీయ స్థాయిలో నిర్వహించిన సాహిత్య ఉత్సవాల్లో ప్రతిభ చాటుకొని శ్రీశ్రీ కళావేదిక నుంచి ప్రశంసాపత్రం, మొమెంటో అందుకున్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన 170వ జాతీయ సాహిత్య--సాంస్కృతిక వైభవ ఉత్సవాల్లో ఆయన రచించిన "అక్షరం ఆయువు.. సాహిత్యమే మన సర్వస్వం" అనే కవిత సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సాహిత్య విలువలు, అక్షరాల గొప్పతనాన్ని ప్రతిబింబించే ఈ కవితకు విశేష ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఛైర్మన్ పి.ఎస్.వి. శ్రీనుబాబు చేతుల మీదుగా నీలంకు ప్రశంసాపత్రం, మొమెంటో అందజేశారు. ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, కళాకారుల సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. యువకవి నీలం సాధించిన ఈ గుర్తింపు రాళ్లపాడు గ్రామానికి, పోలాకి మండలానికి గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ సాహిత్య రచనలు చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.



## డీఎస్సీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు చేయాలి

**ఇచ్ఛాపురం ఆగస్టు 3 (వార్త):** డిఎస్‌సి అక్రమాలపై సిబిఐ దర్యాప్తు చేయాలనీ వైస్సార్సీపీ డిమాండ్ చేసింది. స్థానిక కెనరా బ్యాంకు మేడ పైన టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. ఇన్ ఛార్జ్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి ,నర్తు నరేంద్ర యాదవ్ , జిల్లా మహిళా అధ్యక్షురాలు భారతి దివ్య, ఎంపిపి లు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప,జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కడియాల ప్రకాష్, దువ్వు వివేకానంద, ఆశి పురుషోత్తం,తడక జోగారావు, సారధి, మహేష్, ప్రేమ్ కుమార్, చల్ల దేవరాజు, గాంధీ, సీతయ్య, సఫీ, కిరణ్, గిరి, త్రినాధ్, నూకయ్య,తేజ, జగదీశ్, జయరాం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మూడు రోజుల్లో నారుమళ్లు ఎండిపోయే ప్రమాదం

**సోంపేట, ఆగస్టు 3(వార్త):** మరో మూడు రోజుల్లో వర్షాలు కురియకపోతే సోంపేట మండలంలో నారుమళ్ళకు ప్రమాదం తప్పదని, వాలిపోయే అవకాశాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి బొర్రా నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్, జూలై నెలలో కనీస వర్షపాతం లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. జూన్ నెలలో 56%, జూలై నెలలో 39% వర్షపాతం లోటు ఉందని పేర్కొన్నారు. మెట్ట ప్రాంతాలు అయినా ఉప్పలం, గొల్లూరు, తాళ్లబద్ర, మామిడిపల్లి, పలాసపురం, జింకిభద్ర గ్రామాల్లో నారుమల్లు వడలిపోవడం ప్రారంభమైందని అన్నారు. రాబోవు మూడు రోజుల్లో కనీసం ఒక సెంటీమీటర్ వర్షపాతం ఉంటే తప్పా లేదంటే ఖరీఫ్ సాగు చాలా కష్టమని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆగస్టు 10 తర్వాత రైతులు అపరాలు విత్తుకోవాలని సూచించారు. అపరాల విత్తనాలను రాయితీపై అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాట్లు వేసిన రైతులు మీసేవ కేంద్రాలలో ఎకరాకు 160 రూపాయలు చెల్లించి ఆగస్టు 15లోగా పంటల భీమా చేయించుకోవాలని సూచించారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం

**ఇచ్ఛాపురం ఆగస్టు3 (వార్త):** స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎం ఈ ఓ ఎస్.విశ్వనాధం ఆధ్వర్యంలో 1991-92 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిప్పన జనార్దన్ రెడ్డి,నీలాపు శ్రీనివాస్ రెడ్డి, ఉపేంద్ర, శేఖర్,సాలీనా ఢిల్లీ, దాసరి శేఖర్,లక్ష్మణ్,కుమార్,పట్నాయక్ ,చిరంజీవి నాగేశ్వరరావు, శివాజీ,రాజు,సుదర్శన్,ఇందు శేఖర్,మున్నా పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు. అలాగే సున్నపురం బీచ్ లో 2020-21 విద్యార్థులు శ్రీకాంత్ హేమంత్ కుమార్ శ్రీనివాస్ తదితరులు వేడుకలు నిర్వహించారు.1993-94 విద్యార్థులు కుమార స్వామి రెడ్డి, బాలకృష్ణ, చందు, గణేష్, పుండరీ తదితరులు కలుసుకున్నారు.

## రత్తకన్న 20వ వార్డులో వైస్సార్సీపీ ఇన్ ఛార్జ్ పర్యటన



**ఇచ్ఛాపురం ఆగస్టు3 (వార్త):** మున్సిపాలిటీ పరిధి రత్తకన్న 20వ వార్డు లో వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పర్యటించారు. మంగళ కాలనీలో కాలనీ వాసులతో కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్డు సదుపాయం లేదని, డ్రైనేజీ సదుపాయం లేదని, సరిపడా విద్యుత్ స్తంబాలు లేవని ఉన్న వాటికి విద్యుత్ దీపాలు లేవని,మంచి నీరు సరఫరా లేదని అన్నారు.డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన దోమలు, చెడు వాసన వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని గమనించిన అంశాలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తామని చెప్పారు.రోడ్డు నిర్మాణం కొరకు స్థానిక శాసనసభ్యులు కొన్ని నెలల క్రితం శంకుస్థాపన చేసారు కానీ నేటి వరకూ పనులు ప్రారంభం కాలేదని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, తాతాజీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పరశురామునిగా భక్తులకు జగన్నాథుడు దర్శనం

**మందస, ఆగస్టు 3(వార్త):**మందస పట్టణంలోని శ్రీజగన్నాథస్వామి అవతారోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామివారిని పరశు రాముని అవతారాన్ని ధరింపజేశారు. జగన్నాథుని భక్తులు దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా.. ఇప్పటికే జగన్నాథుని ఉత్సవాలు ముగియగా.. మందసలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రస్తుతం కూడా అవతారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఒడియా సంస్కృతి, సంప్రదాయాలతో జగన్నాథుని ఉత్సవాలు జరుగుతున్నాయి. సాయంత్రం వేళలో మందసలో భక్తులతో సందడి వాతావరణం నెలకొంది.

## పాసు పుస్తకాల పంపిణీ

**కంచిలి, ఆగస్టు 3 (వార్త):** ముండల, అంపురం గ్రామపంచాయతీల పరిధిలోగల రైతులకు మండల టిడిపి అధ్యక్షుడు మాదిని రామారావు చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కట్టుబడి ఎటువంటి సమస్యలకు తావు లేకుండా కూటమి ప్రభుత్వం కొత్త పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తుందని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఫోటోలను ముద్రించిన పరిస్థితి లేకుండా రైతాంగానికి అనుకూలంగా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి డిజిటలైజేషన్తో పాస్ పుస్తకాలు ముద్రించి అందించడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

**శ్రీకాకుళం**

# మధ్యవర్తిత్వంతో ఉచిత న్యాయం

### శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

**శ్రీకాకుళం, ఆగస్టు 3(వార్త):** సమాజంలో పెరుగుతున్న వివాదాలను ఎలాంటి ఖర్చు లేకుండా త్వరితగతిన పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వమే అత్యుత్తమ మార్గమని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కొండబోలు స్పష్టం చేశారు. స్థానిక జిల్లా న్యాయ సేవా సదన్‌లో సోమవారం జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 'మీడియేషన్ 3.0' కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మీడియేషన్ 3.0 ద్వారా సామాన్య ప్రజలకు ఇంటి వద్దకే న్యాయం చేరుతుందన్నారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ వ్యాజ్యా లను కోర్టుల చుట్టూ తిరగకుండా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.మధ్యవర్తిత్వం వల్ల రెండు పక్షాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని, కోర్టు తీర్పు కంటే రాజీ మార్గమే శాశ్వత పరిష్కారమని కార్యక్రమ ప్రత్యేక అతిథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, అడిషనల్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. మీడియేషన్ 3.0లో భాగంగా జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రత్యేక మధ్యవర్తిత్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మధ్యవర్తిత్వ న్యాయవాదులు, ప్యానెల్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయ సేవాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకానికి 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఎంపికై ప్రస్తుతం 10, 11, 12 తరగతులు చదువుతున్న ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు తమ స్కాలర్‌షిప్ పునరుద్ధరణ కోసం ఈనెల 31లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారి ఎ. రవిబాబు తెలిపారు. విద్యార్థులు తేదీ ఈనెల 31లోగా విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి అధికారిక వెబ్సైట్ www.scholarships.gov.inలో తమ దరఖాస్తులను సమర్పించాలని. దరఖాస్తు సమయంలో అవసరమైన స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ, మొదలగునవి జతపరిచి జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం శ్రీకాకుళంలో సమర్పించి జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా అప్లికేషన్ వెరిఫై చేయించుకోవాలని తెలిపారు. గడువులోగా దరఖాస్తు చేయని విద్యార్థులకు స్కాలర్‌షిప్ ప్రయోజనం పొందే అవకాశం ఉండదని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు పూర్తి చేయాలని కోరారు. ఈ విషయమై మరింత సమాచారం కోసం 75693633183ను సంప్రదించాలని ఆయన కోరారు.

## 5న మెగా ఉద్యోగ మేళా

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** నగరంలోని గవర్నమెంట్ డీఎల్‌టీసీ (ఐటిఐ) బలగ రోడ్డు, హాస్పిటల్ జంక్షన్ వద్ద గల జిల్లా ఉపాధి కార్యాలయంలో వివిధ కంపెనీల వారి సహకారంతో ఈనెల 5న ఉదయం 10 గంటలకు మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ తెలిపారు. ఈ జాబ్ మేళాకు సంబంధించి అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్, మాపల్ వెలి స్కూల్, క్వాలిటీ ఫస్ట్, వలెఒ ఫ్రిక్సన్ మెటీరియల్స్ ఇండియా, తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 120 లోన్ ఆఫీసర్ పోస్టులకు గాను నెలకు రూ.16000 నుండి రూ.24,000 జీతంతో శ్రీకాకుళం, టెక్కలి, సోంపేట, రాజాం, పాలకొండ, విజయనగరంలో పనిచేయ వలసి ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ఆ పైన విద్యార్హత కలిగి ఉండి 21 సంవత్సరం నుండి 30 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు, అర్హులని తెలిపారు. మాపల్ వెలి స్కూల్ వారు నెలకు రూ.25000 జీతంతో శ్రీకాకుళం, ఎచ్చెర్లలలో పని చేయుటకు ఏదైనా డిగ్రీ (బిఈడి, డీఎడ్) విద్యార్హత కలిగి 20 నుండి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులకు 50 టీచింగ్ పోస్టులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్వాలిటీ ఫస్ట్ వారు నెలకు 8000 వేల రూపాయలు జీతం తో శ్రీకాకుళంలో పని చేయుటకు ఎస్.ఎస్.సి, నుంచి ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతకు 30 టెలి కలర్స్ ఖాళీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వలెఒ ఫిక్షన్ మెటీరియల్స్ ఇండియా వారు 200 ప్రొడక్షన్, క్వాలిటీ అండ్ డిస్పాచ్ ఖాళీలకు నెలకు 20 వేల రూపాయల జీతంతో చెన్నైలో పని చేయవలసి ఉంటుందని ఐటిఐ, డిప్లమా ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్హత కలిగి ఉండి 18 నుండి 20 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల ఐదో తేదీ ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ డి. ఎల్. టి. సి .(ఐ టి ఐ ) బలగ రోడ్, హాస్పిటల్ జంక్షన్, వద్ద గల జిల్లా ఉపాధి అధికారి వారి కార్యాలయానికి బయోడేటా సర్టిఫికెట్లు ఆధార్ కార్డులతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ www.ncs.gov.inలో నమోదు చేసుకోవాలని సూచించారు.

### 6, 7 తేదీల్లో అమరావతి ఛాంపియన్‌షిప్

## జిల్లా స్థాయి క్రీడా పోటీలు

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీకాకుళం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోడి రామ్మూర్తి నాయుడు స్టేడియంలో జరిగే ఈ ఎంపికల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన అండర్-17 బాల, బాలికలకు మరియు 7వ తేదీన అండర్-23 పురుషులు, మహిళల విభాగాలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, యోగా క్రీడా విభాగాల్లో ఈ ఎంపికలు జరగనున్నాయి.నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే ఎంపికైన క్రీడాకారులందరూ నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటలకల్లా తమ వయోపరిమితికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో కేఆర్ఎన్ స్టేడియంలో హాజరు కావాలని డీఎస్‌డీవో సూచించారు. పోటీలకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం క్రీడాకారులు 9390352942 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

## రాయితీ ధరకే నాణ్యమైన బియ్యం

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రైతుబజార్ ప్రాంగణంలో పౌరసరఫరాల శాఖ, రైస్ మిల్లర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు ప్రధాన రైతుబజార్లతో పాటు 30 రైస్ మిల్లుల్లో ప్రత్యేక అవుట్‌లెట్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి నెలవారీగా గరిష్టంగా 10 కేజీల వరకు స్టీమ్డ్, రా బియ్యాన్ని రాయితీ ధరలకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మార్కెట్ జోక్యం చర్యల ద్వారా బహిరంగ మార్కెట్లో ధరలు అదుపులోకి వస్తాయని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ విక్రయ కేంద్రాల్లో బహిరంగ మార్కెట్లో కేజీ రూ.65 ఉన్న స్టీమ్డ్ బియ్యాన్ని రూ.52లకే, రూ.60 ఉన్న రా బియ్యాన్ని రూ.50లకే అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. లబ్ధిదారులు తమ ఆధార్ సంఖ్యను వెల్లడించి యాప్ ద్వారా నమోదు చేయించుకుని బియ్యం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్య ప్రకాశరావు, మార్కెటింగ్ సహాయ సంచాలకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించండి

* మూడో జాబితాను వెంటనే విడుదల చేయండి
* భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవంలో మీడియాకు అన్యాయం
* శ్రీకాకుళం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు
* కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జర్నలిస్టు సంఘాలు

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా మీడియాకు జరిగిన వివక్ష, అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టులకు జరిగిన అన్యాయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు శ్రీకాకుళం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయిగా నిలిచిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు ప్రతి దశను ప్రజలకు చేరవేయడంలో జిల్లా మీడియా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అలాంటి స్థానిక మీడియాను ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్లక్ష్యం చేయడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా పరిమిత సంఖ్యలో మాత్రమే అవకాశాలు ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల ఎంపికలో అనుసరించిన విధానంపై సమగ్ర విచారణ జరపాలని, భవిష్యత్తులో జరిగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే జిల్లా అక్రిడిటేషన్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించి మూడో జాబితాను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులను పునఃపరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొంక్యాన వేణుగోపాలరావు, ఎన్.ఈశ్వరరావు, నాగేశ్వరరావు, ఎం.బి.మల్లేశ్వరరావు, డోల శంకరరావు, డా. డోల అప్పన్న, గరుగుబిల్లి అప్పలనాయుడు, పేడాడ హేమసుందర్, ఒంపూరు రమేష్, ఆకుల మాధవరావు, బొడ్డ కృష్ణ, సింగూరు శీను, అద్దంకి సురేష్, జి.వి.నాగభూషణరావు, కుంతి చిన్నారావు, చిన్నారావు, ఆర్.వి.పట్నాయక్, గొండు జనార్ధనరావు, టంకాల గోవింద్, శేషగిరిరావు, అప్పన్న, కిల్లి శ్రీనివాసరావు, నారాయణమూర్తి, అలీ బేగ్, ఈశ్వరరావు, శ్యాము, కామేశ్వరరావు తదితర సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌కు 187 వినతులు



**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** అర్జీలపై ప్రతీ రోజు సమీక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తో కలసి ఆయన సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతీ రోజు అర్జీల పై సమీక్ష చేస్తే పెండింగ్ లో ఉండవన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలన్నారు. 187 ఆన్ లైన్ అర్జీలు స్వీకరించగా ఇందులో రెవెన్యూ 45, పంచాయతీ రాజ్ 23, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ 19, స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డ్ 19, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 6, వాటర్ రిసోర్సెస్ ఈఎన్సీ 4, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 8, రూరల్ వాటర్ సప్లై 4, ఎపిఈపిడిసిఎల్ 6, స్కూల్ ఎడ్యుకేషన్ 4, సమగ్ర శిక్ష 3, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 3, రూరల్ డెవలప్మెంట్ 2, ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కేస్ట్ కార్పోరేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ 2, హోం, ఆర్ అండ్ బి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, వ్యవసాయం శాఖ, మత్స్యశాఖ, తదితర శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి అర్జీ చొప్పున స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డిప్యూటీ కలెక్టర్ జి. జయదేవి, డిఆర్డీఎ పిడి కిరణ్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి తల్లి పాల వారోత్సవాల పోస్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, డిప్యూటీ కలెక్టర్ జి. జయదేవి, డిఆర్డీఎ పిడి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పిడి ఎస్. సువర్ణ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ఎస్. సువర్ణ తెలిపారు. తల్లిపాల యొక్క ప్రాముఖ్యత గురించి ఆమె మాట్లాడుతూ ఆరు నెలలు ఖచ్చితంగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, చుక్క మంచి నీళ్లు ఇవ్వకుండా పెంచితేనే పిల్లల అభివృద్ధి అంతా బాగుంటుందన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కంటిన్యూ చేయాలని, ఆరు నెలల నుంచి ఆపకుండా అనుబంధ ఆహారం ఇచ్చినప్పటికీనూ, రెండు సంవత్సరాలు తల్లిపాలు కొనసాగిస్తేనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. మానసిక, శారీరక రుగ్మతలు ఏవీ రాకుండా, ఇన్‌ఫెక్షన్స్ కూడా 2 సంవత్సరాలు పిల్లల మీద ఏ ప్రభావం చూపించకుండా ఉంటుందనేదే తల్లి పాలు ముఖ్య ఉద్దేశమన్నారు.

## ప్రజా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి: ఎస్పీ



ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని నాణ్యతతో, పారదర్శకంగా విచారించి, అర్జీదారులు పూర్తి సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మొత్తం 61 మంది ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. స్వీకరించిన అర్జీలను వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి, చట్టప్రకారం వేగవంతంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలో చర్యలు పూర్తి చేసి, తీసుకున్న చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 61 అర్జీలు స్వీకరించగా, వాటిలో కుటుంబ వివాదాలు, మోసపూరిత కేసులు, ఆస్తి వివాదాలు, సివిల్, సైబర్ నేరాలు, ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# నోరు విప్పితే.. మార్కులు వేయం!

* బెదిరింపులకు పాల్పడుతున్న యాజమాన్యం
* భయంతో గడగడలాడుతున్న విద్యార్థినులు
* 'పోక్సో' నిందితుడుకి సూర్యతేజ వత్తాసు
* యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం




పలాస, ఆగస్టు 3 (వార్త): సూర్య తేజ కాలేజీలో వెలుగుచూసిన వేధింపుల పర్వం చర్చనీయాంశమైంది. యాజమాన్యం సైతం ఈ విషయం బయటకు పొక్కకుండా విద్యార్థినీ విద్యార్థులు మాట్లాడకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. కళాశాలలో ఇదొక్కటే సంఘటన కాదు, బయటకు రానివి ఇంకా చాలా ఉన్నాయని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. అయితే ఆ విద్యార్థులు మాత్రం తమ పేరు బయటపెట్టొద్దని కోరుతున్నారు. కళాశాల ప్రతిష్ట దెబ్బతింటుందనే మిషతో యాజమాన్యం ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, ఆ కామాంధుడిని వెనుకేసుకొస్తూ రక్షణ కవచంలా నిలవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. నోరు విప్పి బయట చెప్తే ప్రాక్టికల్స్‌లో మార్కులు వేయం.. పరీక్షల్లో ఫెయిల్ చేసి భవిష్యత్తు నాశనం చేస్తాం" అంటూ యాజమాన్యం, సంబంధిత వ్యక్తులు పెడుతున్న బెదిరింపులకు మహిళా విద్యార్థినులు భయంతో వణికిపోతున్నారు. విద్యార్థినుల భద్రతను గాలికి వదిలేసి, కామాంధుడికి బాసటగా నిలుస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### జూనియర్ కళాశాలల్లో మహిళా భద్రత కమిటీలు ఏవి

* ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి




రాష్ట్రంలో మహిళల భద్రతపై కూటమి ప్రభుత్వం చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దారుణాలకు పొంతన లేదని, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థినుల భద్రత గాలిలో దీపంగా మారిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక బాలురల వసతి గృహంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నియమ నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ ప్రైవేట్, కార్పొ రేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా అక్రమ దందాలు సాగిస్తున్నా విద్యాశాఖ అధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా నిద్రమత్తులో జోగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సూర్య తేజ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నాన్-టీచింగ్ సిబ్బంది ఒక మైనర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడటం విద్యావ్యవస్థకే సిగ్గు చేటన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో నమోదు చేసి పోక్సో కేసు వివరాలను, ఆ నిందితుడి అరెస్ట్‌తో పాటు రిమాండ్‌కు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు తక్షణమే బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని డొల్ల ప్రచారాలు చేసుకుంటున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కళాశాలల్లో జరుగుతున్న ఈ దారుణాలపై ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో తక్షణమే "మహిళా భద్రతా కమిటీలు" ఏర్పాటు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కోరారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి తగిన చర్యలు తీసుకోకపోతే, జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయాలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కిరణ్, రాజు, పృథ్వి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

### సూర్యతేజపై చర్యలు తీసుకోండి

* వైసీపీ విద్యార్థి విభాగం ఆగ్రహం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యతేజ ప్రైవేట్ కళాశాలలో ఇటీవల వెలుగులోకి వచ్చిన విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం పలాస నియోజకవర్గ అధ్యక్షుడు బమ్మిడి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కొందరు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన యాజమాన్యాలు ఫీజుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మహిళా భద్రతా వ్యవస్థలు, పనిచేసే సీసీ కెమెరాలు, లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు, ఫిర్యాదు వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నప్పటికీ, అనేక ప్రైవేట్ కళాశాలల్లో అవి సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. విద్యార్థినులపై వేధింపులు చోటుచేసుకున్న సందర్భాల్లో సంబంధిత సిబ్బందిపై మాత్రమే కాకుండా, బాధ్యత వహించాల్సిన కళాశాల యాజమాన్యాలపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి, బాధితులకు తగిన నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలకు హెచ్చరికగా మారాలని, తల్లిదండ్రుల విశ్వాసాన్ని కాపాడేలా విద్యాశాఖ కఠిన పర్యవేక్షణ చేపట్టి విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని బమ్మిడి సంతోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



# కార్యకర్తలు, నాయకులకు.. అభినందనలు

* చంద్రబాబు భోగాపురం ఎయిర్ పోర్టుకి నయాపైసా నిధులు ఇవ్వలేదు
* జగన్ హయంలో 2500 ఎకరాల భూసేకరణ
* పన్నెండు వందల కోట్ల రూపాయలు నిధులు వెచ్చించింది వైసీపీ సర్కారు
* కేంద్ర ప్రభుత్వం అనుమతులు వైసీపీ సర్కారు హయంలో వచ్చినవే
* అవసరమైతే ఏ వేదిక మీద అయినా చర్చకు సిద్ధం
* సీదిరి, చింతాడపై కేసులు.. అక్రమం
* మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** వైయస్ జగన్ శ్రీకాకుళం పర్యటన విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభినందనలు తెలిపారు. సోమవారం సింగుపురంలోని తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం పర్యటన విజయవంతం కావడంలో ప్రతీ నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సందడి చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లాకు చెప్పుకోదగ్గ ఒక్క పెద్ద అభివృద్ధి కార్యక్రమమైనా జరిగిందా అని ప్రశ్నించారు. విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 23 జాతీయ సంస్థల్లో ఒక్కటైనా శ్రీకాకుళం జిల్లాకు తీసుకురావాలని డిమాండ్ చేయలేకపోవడం ఇక్కడి టీడీపీ ప్రజాప్రతినిధుల వైఫల్యం చెందారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతీ నాయకుడు ఒక బాధ్యతగా ప్రజా సమస్యలపై నిరంతరం మాట్లాడాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు చురుకుగా పనిచేస్తే రానున్న రోజుల్లో పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని, జగన్మోహన్ రెడ్డి తదుపరి పర్యటనకు ఇంకా ఎక్కువ మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు పచ్చి అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ మత్స్యకార గ్రామాల్లో జరిగిన నిరసనలు జిల్లా వ్యాప్తంగా విస్తరించడం ప్రతిపక్ష బాధ్యతను చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఒక విద్యార్థిపై హత్య కేసు నమోదు చేసి జైలుకు పంపడం వంటి చర్యలు ఆందోళనకరమని, పరిపాలనలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల గౌరవం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయని, అమాయకులపై తీవ్రమైన కేసులు నమోదు చేసే పరిస్థితి రావడం విచారకరమని, ప్రభుత్వానికి రెండేళ్ల పాలన పూర్తయిందని, మరో మూడేళ్లపాటు ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులంతా పోరాట స్ఫూర్తితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవిపై నమోదు చేసిన కేసు పూర్తిగా అన్యాయమన్నారు. పార్టీ నిర్మాణంలో చురుకుగా పనిచేస్తూ ప్రజల్లో ఆదరణ పొందుతున్నందుకే ఆయనపై వివిధ క్రిమినల్ సెక్షన్లు నమోదు చేసి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతున్న ఈ దమనకాండకు ముగింపు పలకాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై నమోదు చేసిన అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టు నేపథ్యంలో జిల్లాలో గ్రామ గ్రామాన సభలు నిర్వహించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని, విమానాశ్రయం కోసం రాష్ట్ర బడ్జెట్ నుంచి సుమారు రూ.1,200 కోట్లు కేటాయించి, 2,500 ఎకరాల భూసేకరణను జగన్ ప్రభుత్వమే పూర్తి చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు సాధించడం, ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సమీకరణ పూర్తిచేయడం, బ్యాంకుల నుంచి సుమారు రూ.4,000 కోట్ల రుణానికి ఆమోదం పొందించడం వంటి కీలక ప్రక్రియలన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. అనంతరం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని, విమానాశ్రయం నిర్మాణంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్ర ఏమిటో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. పునాది ఎప్పుడు పడింది, ఏ అనుమతులు ఎప్పుడు వచ్చాయి, ఫైనాన్షియల్ క్లోజర్ ఎప్పుడు పూర్తయింది, ఎంత భూమి సేకరించారు, రైతులకు ఎంత పరిహారం చెల్లించారు, గత మూడు రాష్ట్ర బడ్జెట్లలో భోగాపురం కోసం ప్రభుత్వం ఎంత నిధులు కేటాయించిందో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పార్టీకి అనుకూలంగా మీడియా సంస్థలు లేని పరిస్థితిలో సోషల్ మీడియానే ప్రధాన ఆయుధమని పేర్కొన్న ధర్మాన ప్రసాదరావు, వాస్తవాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త తన సెల్‌ఫోన్ ద్వారానే నిజాలను విస్తృతంగా ప్రచారం చేయగలడని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు వాస్తవాలు విరుద్ధమన్నారు. గత మూడు రాష్ట్ర బడ్జెట్లలో శ్రీకాకుళం జిల్లాకు చెప్పుకోదగ్గ స్థాయిలో నిధులు కేటాయించలేదని, ఇప్పుడు అభివృద్ధి ద్వారాలు తెరిచామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. రానున్న బడ్జెట్లలో కూడా పరిస్థితి మారే సూచనలు కనిపించడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కంటే రియల్ ఎస్టేట్‌పైనే ఎక్కువ ఆసక్తి ఉందని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి లక్షలాది మంది ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. సమావేశంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

# భూములకు హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

* ఎమ్మెల్యే కూన రవికుమార్

**ఆమదాలవలస, ఆగస్టు 3 (వార్త):** అక్కులపేట గ్రామంలో 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమాన్ని శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. భూ యజమానుల హక్కులను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం పారదర్శక విధానాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రాజముద్రతో అందజేస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాలు రైతుల ఆస్తి హక్కులకు శాశ్వత ధ్రువీకరణగా నిలుస్తాయని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత,, మండల అధ్యక్షులు నూకరాజు, బొడ్డేపల్లి గౌరీపతి, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

### రూ.26లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాలు ప్రారంభం

**సరుబుజ్జిలి:** వీరమల్లిపేట గ్రామం బురిడీవలస కాలనీలో రూ.26 లక్షల వ్యయంతో సమగ్ర శిక్ష నిధుల ద్వారా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాలను ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన ఈ నూతన భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, మండల అధ్యక్షులు అంబల్ల రాంబాబు, తర్లాడ సురేంద్ర, కిల్లి సిద్ధార్థ, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546